ఇసుక కొరత వల్ల పనుల్లేక ఆకలితో అలమటిస్తున్న భవన నిర్మాణ కార్మికులను ఈరోజు (30 అక్టోబర్) బెంజ్ సర్కిల్ వద్ద కార్మికులను పరామర్శించిన సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు. ప్రచురణార్థం విడుదల చేస్తున్నాం.

–జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

## కార్మికులు ధైర్యంగా ఉండాలి

## - సిపిఎం అండగా ఉంటుంది

## - భవన నిర్మాణ కార్మికులకు సిపిఎం బృందం పరామర్శ

ఐదు నెలలుగా ఇసుక కొరత వల్ల పనుల్లేక ఆకలితో అలమటిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు సిపిఎం అండగా ఉంటుందని, కార్మికులు ధైర్యంగా ఉండాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. కార్మికుల చేసే న్యాయబద్ధమైన పోరాటాలకు కార్మికులతో భుజం భుజం కలిపి సమస్యలపై పోరాడడానికి సిపిఎం కలిసి వస్తుందని తెలిపారు. విజయవాడలోని బెంజ్‌సర్కిల్ వద్ద భవన నిర్మాణ రంగం కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను సిపిఎం బృందం బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించింది. కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు అడిగి తెలుసుకున్నారు. గత ఐదు నెలలుగా పనుల్లేకపోవడంతో తాము పడుతున్న కష్టాలను నాయకులకు వివరిస్తూ కార్మికులు కన్నీరు మున్నీరయ్యారు. పూట గడవడం కూడా కష్టతరంగా మారి, కొన్ని సార్లు మంచినీటితోనే కడుపునింపుకుంటున్నామని చెప్పి వాపోయారు. కార్మికులంతా ధైర్యంగా ఉండాలని, వారికి సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటుందని నాయకులు భుజం తట్టి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరు అంతా మంచిగా ఉందని, కింది స్థాయి అధికారులిచ్చే తప్పుడు రిపోర్టులు చూసి ముఖ్యమంత్రి మురిసిపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఐదు నెలలుగా ఇసుక కొరత వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కార్మికులు అర్ధాకలితో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారి కష్టాలను ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికే గుంటూరు జిల్లాలో ఆకలి బాధలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఏడుగురు బవన నిర్మాణ రంగం కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని సిఎంకు గుర్తుచేశారు. భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమ బోర్డు నుండి ఒక్కో కార్మిక కుటుంబానికి రూ.10వేలు పరిహారం తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే తదుపరి జరిగే విపత్కర పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్ధతనం, నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో ఇసుక కొరత ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చేతకానితనం వల్ల ట్రక్కు ఇసుక ధర గతంలో రూ.2వేలు ఉంటే ప్రస్తుతం రూ.7-8 వేలకు చేరిందని అన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ఇసుక కొరత ఏర్పడిందని ప్రభుత్వం చెప్పడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇసుక కొరత ఏర్పడిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఐదు నెలలుగా 30లక్షల కార్మిక కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తుంటే అధికారపక్షం నాయకులు ఏ ఒక్కరూ కార్మికులను పరామర్శిండంగాని, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నవారు గాని లేకపోవడం శోచనీయమన్నారు. టిడిపి ప్రభుత్వం ఇసుక దందాలు చేయడంవల్లే ఆ పార్టీని ప్రజలు తుంగలో తొక్కారని, వైసిపి ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో వెళుతోందని వివరించారు. విలేజి, వార్డు వాలంటీర్లతో కార్మికులు పడుతున్న ఇబ్బందులు, వారు నెలలో ఎన్ని రోజులు పనులకు వెళుతున్నారో ఆరా తీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్మికులు చేపట్టే కార్యక్రమాలకు సిపిఎం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. భవన నిర్మాణ రంగం కార్మికులు చేపట్టిన సామూహిక రాయబారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజయవాడ తూర్పు భవన నిర్మాణరంగం కార్మికుల యూనియన్ అధ్యక్షులు జోడెడ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, యూనియన్ తూర్పు కార్యదర్శి మీరావలి, యూనియన్ నాయకులు కొప్పుల కుమార్, కార్మికులు తదితరులు పాల్గన్నారు.

### ఇంటి అద్దెలు కూడా కట్టలేకపోతున్నాం - రాజు (కార్మికుడు)

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి 20-25 ఏళ్లకితం విజయవాడకు వలస వచ్చి అద్దె ఇళ్లల్లో ఇక్కడే స్థిరపడ్డాం. గత ఐదునెలలుగా కనీసం ఇంటి అద్దెలు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాం. ఇంటి యజమానులు అద్దెల కోసం మాపై ఒత్తిడి చేస్తున్నారు. అద్దె కట్టలేకపోతే బయటకి పోండి అంటున్నారు. 20 ఏళ్ల కాలంలో ఇటువంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వం తక్షణమే ఇసుక విడుదల చేసి, మా కుటుంబాలను ఆదుకోవాలి. ఐదు నెలల క్రితం నెల మొత్తం పనులుండేవి, ఇప్పుడు మూడు రోజులు కూడా పని దొరకడం కష్టంగా మారింది. మా కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం న్యాయం చేయాలి.

### ఒక్క కన్ను ఉన్నా పనికి వెళ్తున్నా - కోటిలింగాల.లక్ష్మి (కార్మికురాలు)

నాలుగేళ్ల క్రితం సిమెంటు పనికి వెళ్లినప్పుడు, సిమెంటు నా కుడి కంటిలో పడింది. దీంతో నా కన్ను దెబ్బతినడంతో కన్ను తీసేశారు. గాజు కన్ను పెట్టుకుని, అలాగే ఒక్క కంటితో పనులకు వెళుతున్నా. పెన్షన్ కోసం ప్రయత్నించి విసిగిపోయాను. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఏ డాక్టరూ నన్ను పట్టించుకోలేదు. ఇటు పెన్షన్ రాక, పనులు దొరక్క తినడానికి తిండి లేక, కొన్ని సార్లు మంచినీళ్లతోనే కడుపునింపుకుంటున్నాను(కన్నీటి పర్యతం). ప్రభుత్వం మాకు ఏ మేలూ చేయకపోయినా పర్వాలేదు కానీ, ఇసుక ఇచ్చి పనులు కల్పించాలని కోరుతున్నాను.

### కార్మికులు ఓట్లు వేయకుండానే జగన్ ముఖ్యమంత్రి అయ్యాడా? - మర్యాద. వెంకటేశ్వరరావు (మేస్త్రి)

కార్మికులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టలేదు. 30 లక్షల మంది కార్మికుల కష్టాలు ముఖ్యమంత్రికి కనబడడంలేదా? లక్ష రూపాయల వేతనం ఉన్న ఉద్యోగులకు మరింత వేతనాలు పెంచుతూ, కనీసం ఒక్క పూట పొట్ట నింపుకునే పరిస్థితిలేని కార్మికులను పట్టించుకోకపోవడం అన్యాయం. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్ ఇలా ఎప్పుడూ చేయలేదు. ఇసుక దొరక్క ఐదు నెలలుగా కార్మికులు ఇళ్లకే పరిమితం అయ్యారు. అప్పులు దొరక్క కుటుంబాలతో తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులకు పనులు కల్పించాలి.

= = = =